# మన(సు)లో మాట

పాఠక మహాశయులకు సంఘమిత్ర సంపాదక వర్గం స్వాగతం పలుకుతోంది. ఉగాది సంచికలోని విశ్వకవి వేమన, మేధామాత్రికలు, నవ్వితే నవ్వండి! శీర్షికలు మీకు నచ్చినందుకు సంతోషం. 'నవ్వితే నవ్వండి!' శీర్షికను ముందు ముందు మరిన్ని చలోక్తులతో, హాస్య గుళికలతో మీకు అందించే ప్రయత్నం చేస్తాము. మా ప్రయత్నానికి అడుగడుగునా చేయూతనిస్తూ, ప్రోత్సాహిస్తున్న 'ఎందరో మహానుభావులు' - అందరికీ ధన్యవాదములు. ఉగాది సంచిక ముఖచిత్రముగురించి ప్రస్థావిస్తూ, మీలో కొంతమంది చెప్పినట్లు - నూతన సంవత్సరాన్ని తెలియజేస్తూ భానోదయాన్ని, ప్రక్కనే క్రొత్త సంవత్సరంలోనికి అడుగుపెట్టడానికి ద్వారబంధమును ఎంపిక చేయడము జరిగింది.

ఈ సంచికలలో ఆగష్టు 15 స్వాతంత్ర్యదినోత్సవమును దృష్టిలో ఉంచుకుని శ్రీ జ్యోశ్యుల గోపాలకృష్ణమూర్తి గారి 'నవోదయం' కవితను ప్రచురిస్తున్నాము. అలాగే మనలో కొంతమంది నేటికీ అనుసరించే కొన్ని ఆచారాలు, వాటి ప్రాముఖ్యమును గుర్తు చేస్తూ - 'మన ఆచారాలు - అంతరార్థములు' అన్న శీర్షికను ప్రవేశపెడుతున్నాము. ఈ విషయములో పెద్దలందరికీ ఓ విన్నపము. మీకు తెలిసిన మన ఆచారములు, వాటి విలువలు మీరు తెలియజేస్తే, అది రేపటి తరానికి ఎంతో ఉపయోగపడుతుంది. మరపురాని అనుభూతులను తెలియజేస్తూ 'నా స్మృతి పథంలో ఒక రోజు' మీ మన్ననలకు పాత్రమౌతుందని మా నమ్మకము. మన పెద్దలు చెప్పినట్లు - 'కష్టాన్ని పంచుకుంటే అది సగమౌతుంది. ఆనందాన్ని పంచుకుంటే అది రెట్టింపు అవుతుంది". సరే మీ అనుభవాలని నలుగురికి తెలిపి ఆ అనుభవతరంగాలని ప్రసరింపజేయండి.

ఈ సంవత్సరము కూడా జూన్ - జులై నెలలలో (అమెరికాలో) పిల్లలకు వేసవి సెలవులను దృష్టియందుంచుకుని "శ్రీనివాస రామానుజన్ మేధమేట్రిక్స్ క్లబ్" నిర్వహించడము జరుగుతున్నది. దీనికి హాజరవుతున్న పిల్లలు, పెద్దలు ఇందులో తెలియజేస్తున్న చిట్కాలను, కష్టమైన సమస్యలు - వాటి పరిష్కారములు - మెచ్చుకుంటూ, ఆడుతూ పాడుతూ వారికి తెలిసిన చిట్కాలను చెప్పడం జరుగుతోంది. ఇవే విషయాలను మేధామాత్రికలు శీర్షికలో ప్రస్తావించడం జరుగుతోంది. మీ పిల్లలకు ఈ చిట్కాలు నేర్పండి. పలువురి సూచన మేరకు పిల్లలకు తెలుగు నేర్పడము గురించి సంఘమిత్ర కార్యవర్గం ఆలోచిస్తోంది. త్వరలో దానికి శ్రీకారం చుట్టగలమని ఆశిస్తున్నాము.

ఈసారి 'పదచదరంగం', 'సమస్యలతోరణం', 'చెప్పుకోండి చూద్దాం!', "పిల్లలకు పద చదరంగం" (ఆంగ్లములో) శీర్షికలకు సమాధానములు పంపిన పాఠకులకు అభినందనలు. మీకు తెలిసినంతవరకు సమాధానములు సెప్టెంబరు 15వ తేదీ లోగా (ఇంగ్లీషులోనైనా) వ్రాసి పంపించవచ్చు. మళ్ళీ విజయదశమి సంచికలో కలుద్దాం! అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.